తీరనున్న వాహనదారుల ఇబ్బందులు

- ఖిల్లాఘనపురం, మామిడిమాడ గ్రామాల సమీపంలో బ్రిడ్జిల నిర్మాణం
- ఎఫ్‌డీఆర్ నిధులతో పనులు ప్రారంభం



మామిడిమాడ సమీపంలో నిర్మించిన బ్రిడ్జి



ఖిల్లాఘనపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్మాణం పూర్తయిన బ్రిడ్జి

ఖిల్లాఘనపురం: వర్షాకాలం వచ్చిందంటే చాలు ఖిల్లాఘనపురం, మామిడిమాడ గ్రామాల సమీపంలో ఏళ్ల క్రితం నిర్మించిన కల్వర్టులపై నుంచి పెద్ద ఎత్తున వర్షపు నీరు పారడంతో అటుగా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. మండలంలోని పలుగ్రామాల ప్రజలు సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంతో ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం 2023లో నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం రెండు వాగుల వద్ద బ్రిడ్జిల నిర్మాణాలు చేపడ్డంతో వర్షాకాలంలో వాహనదారులకు సమస్యల నుంచి విముక్తి కలగనుంది. ఈ మార్గంలో మిగిలిన చిన్న, చిన్న పనులు పూర్తి చేసి త్వరలోనే ప్రారంభించేందుకు ఆర్అండ్‌బీ అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

రూ.4.70 కోట్ల నిధులతో..

ఖిల్లాఘనపురం నుంచి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి వెళ్లే రోడ్డుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.2.50 కోట్లు, మామిడిమాడ శివారులో సల్కెలాపురం, వెల్కిచెర్ల గ్రామాలకు వెళ్లే రోడ్డుకు బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.2.20 కోట్ల ఎఫ్‌డీఆర్ నిధులను ప్రభుత్వం 2023 లో మంజూరు చేసింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు వేగంగా చేపట్టడంతో వాహనదారులకు అందుబాటులోకి వచ్చాయి. కేవలం బ్రిడ్జిలకు రెండు వైపుల బీటీలు వేసే పనులు మాత్రమే మిగిలాయని అధికారులు తెలిపారు.

గణపసముద్రం పాటు కాల్వపై..

ఖిల్లాఘనపురం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద గణపసముద్రం పాటు కాల్వపై గతంలో నిర్మించిన కల్వర్టు దగ్గర ప్రతి సంవత్సరం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద వాగు పారిందంటే చాలు పాటు కాల్వకు వరద పోటెత్తడంతో నీళ్లు కల్వర్టుపై నుంచి పారడమే కాకుండా తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ ఆవరణలోకి వెళ్లేయి. ఈ సమయంలో కొన్నిసార్లు వాహనాల రాకపోకలకు అంతరాయం ఘటనలు చోటు చేసుకున్నాయి. బ్రిడ్జి నిర్మాణం పూర్తికావడంతో ఇక నుంచి ఎంత వర్షం కురిసినా ఇబ్బందులు కలగవని వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా మామిడిమాడ సమీపంలో కూడా ప్రతి సంవత్సరం ఇదే పరిస్థితి. అక్కడ నిర్మించే బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయడం వలన శాశ్వత పరిష్కారం లభించనుంది.

> **బ్రిడ్జి పనులు పూర్తి చేశాం**
>
> 
>
> ఖిల్లాఘనపురం, మామిడిమాడ గ్రామాల సమీపంలో ఉన్న పాత కల్వర్టులను తొలిగించి నూతనంగా రెండు ప్రాంతాల్లో బ్రిడ్జిల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం ఎఫ్‌డీఆర్ నిధులు రూ.4.70 కోట్ల నిధులను 2023లో మంజూరు చేసింది. టెండర్ల ప్రక్రియ వేగంగా పూర్తి కావడంతో పనులు జోరందుకున్నాయి. రెండు బ్రిడ్జిల వద్ద మిగిలిన చిన్నపాటి పనులు పూర్తిచేసి వాహనాల రాకపోకలు కొనసాగిస్తాం.
>
> – రాకేష్, ఆర్అండ్‌బీ ఏఈ

బస్తీ దవాఖానాకు అటెండరే దిక్కు!

- వైద్యులు, సిబ్బంది లేక వెలవెల
- రోగులకు అందని వైద్యం



ఆత్మకూర్ బస్తీ దవాఖానా

ఆత్మకూర్: పట్టణంలోని కుర్వవీధిలో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానా మూణ్నాళ్ల ముచ్చటగానే మారింది. 2023, డిసెంబర్ 3న రోగుల సౌకర్యార్థం రూ.13లక్షలు ఖర్చుచేసి అప్పటి ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా దవాఖానా ప్రారంభించారు. కొన్నాళ్ల పాటు ఒక వైద్యుడు, నర్సు, అటెండర్ నిర్వహణలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వైద్యుడు రాజీనామా చేసి వెళ్లిపోవడంతో కొన్నాళ్లకు డిప్యూటేషన్‌పై వైద్యురాలిని నియమించారు. అనంతరం వైద్యురాలు, ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎం డిప్యూటేషన్‌పై వెళ్లిపోవడంతో అటెండర్ నిర్వహణలోనే ఆస్పత్రి కొనసాగుతుంది. ఎమ్మెల్యేతో పాటు జిల్లా వైద్యాధికారి దృష్టి సారించి వైద్యులు, సిబ్బందిని నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

పనులు చేయకుండానే నిధులు స్వాహా

- 2008 నుంచి సాగని తరగతి గదుల పనులు
- సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న విద్యార్థులు



పిల్లర్ల దశలో నిలిచిన తరగతి నిర్మాణం

ఆత్మకూర్: స్థానిక ప్రభుత్వ కళాశాల ఆవరణలోనే హైస్కూల్‌ను కొనసాగిస్తున్నారు. పాఠశాలలో 200 పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేకపోవడంతో జనవరి 6, 2008లో రూ.20 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం అప్పటి ఎమ్మెల్యే స్వర్ణసుధాకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. పునాది లెవల్లో నిర్మాణ పనులు చేపట్టి అందిన కాడికి బిల్లులు డ్రా చేసుకున్న కాంట్రాక్టర్ చేతులెత్తేయడంతో ఆనాటి నుంచి నేటి వరకు పనులు నిలిచిపోయాయి. సరైన తరగతి గదులు లేకపోవడంతో వరండాల్లోనే విద్యార్థులు చదువును కొనసాగిస్తున్నారు. దీనికి తోడు మరుగుదొడ్లు, మూత్రశాల, తాగునీటి సౌకర్యం లేకపోవడం లాంటి సమస్యలతో విద్యార్థులు సతమతమవుతున్నారు. కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే విద్యార్థులపై సమస్యపై దృష్టి సారించి ప్రభుత్వ పాఠశాలను సందర్శించి సమస్యలన్నింటినీ పరిష్కరించాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

జాబితాలో మా పేర్లు లేవు సారూ!

- ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో కనిపించని దరఖాస్తుదారుల పేర్లు
- ఆందోళనలో పేదలు



శాగాపూర్‌తండాలో వివరాలు సేకరిస్తున్న పంచాయతీ కార్యదర్శి (ఫైల్)

పాన్‌గల్: ఇందిరమ్మ ఇంటింటి సర్వేలో కొందరి అర్హుల పేర్లు నమోదు కాకపోవడంతో మండలంలోని చాలా గ్రామాల్లో అర్హులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాపాలనలో స్పష్టంగా దరఖాస్తు చేసుకున్నప్పటికీ తమ పేరు రాకపోవడం ఏమిటని అధికారుల వద్ద ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో పరిస్థితి

మండలంలోని 28 పంచాయతీల్లో 13,540 మంది ఇందిరమ్మ ఇంటి కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నారు. పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికీ తిరిగి యజమానిని ఇంటి వద్ద నిల్చోబెట్టిన మూడు ఫొటోలు తీసి ఫోన్ యాప్‌లో ఇంటి పరిస్థితి నమోదు చేస్తున్నారు. ఇలా మండల వ్యాప్తంగా ఇప్పటికి 86 శాతం వరకు సర్వే వివరాలను యాప్‌లో నిక్షిప్తం చేశారు.

తప్పిదం ఎక్కడ జరిగింది

మండలంలోని వివిధ గ్రామాల్లో వందల సంఖ్యలో పేర్లు సర్వే చేసేందుకు జాబితాలో రాలేదని అధికారులే చెబుతున్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకునే సమయంలో కొందరు ఇల్లు కావాలి అనే వివరం వద్ద టిక్ చేయకపోవడం, అర్హుడి ఆధార్ సంఖ్య, సెల్‌ఫోన్‌కు అనుసంధానం లేకపోవడం, కంప్యూటర్ ఆపరేటర్లు తప్పుగా నమోదు చేయడం తదితర కారణాలుగా చూపిస్తున్నారు. నమోదు సమయంలో కొందరు ఆపరేటర్లు చేసిన తప్పులకు తమకు ఇబ్బందులు కలుగుతున్నాయని పలువురు వాపోతున్నారు. పాన్‌గల్‌కు చెందిన షేక్ షాహీన్‌బీ ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా.. సర్వేలో ఆమె పేరు లేదు. సర్వే సమయంలో ఈ విషయంపై అధికారులను ప్రశ్నించగా జాబితాలో పేరు ఉంటేనే వివరాలు నమోదు చేస్తామని చెప్పడంతో ఆమె ఏమి చేయలేకపోయింది. ఇలాంటి సమస్య చాలా గ్రామాల్లో ఉన్నాయి.

> **ఉన్నతాధికారులకు నివేదించాం**
>
> ఇళ్ల సర్వే జాబితాలో పేర్లు లేని అర్హుల సమస్యను జిల్లా అధికారులకు నివేదించాం. జాబితాలో పేర్లు లేని వారికి అవకాశం కల్పిస్తే మరోమారు సర్వే చేసి వారి వివరాలను సేకరిస్తాం. ఈ విషయంలో అర్హులు ఆందోళన చెందొద్దు.
>
> – గోవింద్‌రావు ఎంపీడీఓ, పాన్‌గల్

శిథిలావస్థలో కళాశాల భవనం



ఆత్మకూర్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం శిథిలావస్థకు చేరుకుని కూలేందుకు సిద్ధంగా ఉంది. శిథిలావస్థకు చేరుకున్న పాత భవనం ఎప్పుడెప్పుడు కూలుతుందోనని విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో మొదటి సంవత్సరంలో 208 మంది, సెకండియర్‌లో 172 మంది, ఒకేషనల్ కోర్సు ఫస్టియర్‌లో 75 మంది, సెకండియర్‌లో 60 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 50 ఏళ్ల క్రితం ఏర్పడిన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రమాదం జరుగకముందే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పండుగ సాయన్న పురస్కారం అందజేత



అమరచింత: పట్టణానికి చెందిన కవి తెలుగు తిరుమలేష్ పండుగ సాయన్న రాష్ట్ర స్థాయి సేవా పురస్కారాన్ని ఆదివారం హైదరాబాద్‌లో అందుకున్నారు. బషీర్‌బాగ్‌లో జరిగిన కార్యక్రమంలో బహుజన నాయకులు, సామాజిక సంస్థల్లో సేవలు అందిస్తున్న వారితో పాటు కవులకు పండుగల సాయన్న అవార్డులను ప్రతి సంవత్సరం అందిస్తుంటారన్నారు. ఇందులో భాగంగానే కవిగా ఎన్నో పుస్తకాలను పరిచయం చేసిన తిరుమలేష్‌కు శాసనమండలి సభ్యుడు ప్రొఫెసర్ కోదండరాం చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమం : సీపీఎం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు

పాన్‌గల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలంటూ దీక్షలు చేపడుతున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు అన్నారు. స్థానిక సమస్యల పరిష్కారం కోరుతూ ఆదివారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలో సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలను ఆదివారం పార్టీ మండల కార్యదర్శి బాల్యానాయక్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో పేద ప్రజలు, రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధి కూలీలకు ఏడాదికి 200 రోజుల పని దినాలు కల్పించాలని, ప్రతి కూలీకి రోజుకు రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, పింఛన్లు, మిగిలిన రైతులకు పంట రుణమాఫీ, డ్రెయినేజీలు, సీసీ రోడ్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అలాగే ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల్లో మిగిలిన వాటిని అమలు చేయాలన్నారు. ప్రతి గ్రామంలో పార్టీ ఆధ్వర్యంలో దీక్షలు చేపడుతూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జంబులయ్య, కృష్ణయ్య, భీమయ్య, నాగయ్య, సాయిలు, రాములు, సత్యం, ఐద్వా నాయకులు పావని, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ పోరాటంతోనే పేదలకు సంక్షేమం



వృద్ధుడికి సీపీఐ సభ్యత్వం అందజేస్తున్న నాయకులు

వనపర్తి రూరల్: సీపీఐ వనపర్తి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌లో 94ఏళ్ల వృద్ధుడు కృష్ణయ్యకు సీపీఐ సభ్యత్వం ఇచ్చి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా కార్యదర్శి గోపాలకృష్ణ, పట్టణ కార్యదర్శి జె రమేష్ పాల్గొని మాట్లాడుతూ సీపీఐ పటిష్టతతోనే కష్టజీవుల బతుకులు బాగుపడుతాయని, అధికారంలోకి రాకపోయినా ప్రజల పక్షాన ఎర్రజెండా పోరాటం చేస్తుందన్నారు. రైతులకు రుణమాఫీ, నిరుపేదలకు ఇళ్లు, స్థలాలు, ఆసరా పింఛన్లు, రేషన్ కార్డులు సీపీఐ పోరాటం ఫలితంగానే లభించాయన్నారు. రైతులకు గిట్టుబాటు ధర, కార్మికులకు కనీస వేతనం, వ్యవసాయ కూలీలకు కనీస కూలి కోసం పోరాడుతుందన్నారు. సీపీఐ సభ్యత్వం స్వీకరించి సమస్యల పరిష్కారానికి పోరాడాలని పిలుపునిచ్చారు. కిష్టయ్య, కార్యవర్గ సభ్యులు పి కళావతమ్మ, లక్ష్మీనారాయణ, చిన్నకురుమన్న, జయమ్మ, శిరీష, జ్యోతి, రవి పాల్గొన్నారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం



వనపర్తి రూరల్: మండలంలోని కడుకుంట్లలో శ్రీసత్యసాయి హోమియోపతి క్లీనిక్ డా.బత్తుల సాయి కృష్ణగౌడ్ మహబూబ్‌నగర్ వారిచే ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో దాదాపు 220 మంది వివిధ రకాల పరీక్షలు నిర్వహించి హోమియోపతి మందులు పంపిణీ చేశారు. డా.సాయికృష్ణగౌడ్ కడుకుంట్ల గ్రామానికి చెందిన వారు కావడంతో గ్రామంపై ఉన్న అభిమానంతో ప్రజలకు ఉచితంగా వైద్యం నిర్వహించి మందులు పంపిణీ చేసిన ఆయనను గ్రామ ప్రజలు, యువకులు, వివిధ పార్టీల నాయకులు కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ నవ్య, ఉపాధ్యాయుడు సాయిశేఖర్‌గౌడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

ఆత్మకూర్: మూడు రోజులుగా కొనసాగిన మల్లాపురం వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ముగిసాయి. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా గరుడ హోమం, మన్యుసూక్త హోమం, ప్రాయశ్చిత హోమాలు, బలి ప్రధానం, పూర్ణాహుతి హోమం, పుష్పయాగం, చక్రస్నానంతో కార్యక్రమాలు ముగిశాయి. మూడు రోజుల పాటు జరిగిన బ్రహ్మోత్సవాల్లో మండలంలోని ఆయా గ్రామాల భక్తులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తుల వేలాదిగా తరలొచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి అవాంతరాలు కలుగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకుని తీర్థప్రసాదాలు అందించారు.

డి-36 కాల్వలో రాళ్ల తొలగింపు

చిన్నంబావి: జూరాల చివరి ఆయకట్టు అయిన వెల్టూరు, చిన్నమారు, అయ్యవారిపల్లి, చెల్లపాడు గ్రామాలకు సాగునీరు అందడం లేదని, దీనికి ప్రధాన కారణం డీ 36 కాల్వ వెంబడి ఉన్న రైతులు కాల్వలో రాళ్లతో గోడ కట్టడమే ప్రధాన కారణమని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కళ్యాణ్‌రావు దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ఆయన రైతులు, లస్కర్లు, వర్క్‌ఇన్‌స్పెక్టర్‌తో కలిసి కాల్వలను సందర్శించారు. ఈసందర్భంగా చిన్నమారు నుంచి బెక్కెం గ్రామం వరకు కాలువ వెంబడి రైతులతో కలిసి ఆయన పర్యటించారు. ఈసందర్భంగా కాల్వలో అడ్డుగా ఉన్న రాళ్లగోడలను రైతులతో కలిసి తొలగించారు. ఇటీవల మండలంలో మంత్రి జూపల్లి పర్యటించినప్పుడు చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఆయన ఒక్క రోజులోనే సమస్యను పరిష్కారానికి చొరువ చూపారన్నారు. ఇక నుంచి ఎవరైనా ఇలా అడ్డుగా రాళ్లను పెడితే అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్, మాజీ సర్పంచ్ మద్దిలేటి, ఆకుల వెంకటేష్, గోవింద్, ప్రకాష్, మధు, వినోద్‌కుమార్, లస్కర్లు, రైతులు పాల్గొన్నారు.

శబరికి తరలిన అయ్యప్ప దీక్షాపరులు

అమరచింత: మండల కేంద్రంలో ఆదివారం అయ్యప్ప దీక్ష చేపట్టిన మాలధారులు ఇరుముడి కట్టుకుని శబరియాత్రకు బయలుదేరారు. గురుస్వాములు మాకం నరసింహులు ఆధ్వర్యంలో దీక్షాపరులకు ఇరుముడి కట్టి అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శబరికి వెళ్తున్న మాలధారులు పట్టణంలో అయ్యప్ప స్మరణ చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనాల్లో శబరియాత్రకు వెళ్లారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కొత్తకోట: సగర సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం స్థానిక సగర సంఘం నాయకులు, సభ్యులు ఆవిష్కరించారు. అనంతరం క్యాలెండర్లను అందజేశారు. కార్యక్రమంలో శేఖర్‌సాగర్, యాదయ్యసాగర్ తదితరులు ఉన్నారు.

సమాజంపై అవగాహన కల్పించాలి

ఖిల్లాఘనపురం: శిశుమందిర్‌కు వచ్చే విద్యార్థులకు సమాజంపై అవగాహన కల్పించాలని, మంచి, చెడుపై మార్గనిర్దేశం చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు గాండ్ల రాములు కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని శిశుమందిర్‌లో బాల సంస్కార్ మాతాజీలు, ఆచార్యుల వర్గ నిర్వహించగా వారు హాజరై భారతమాత చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చిన్నారులకు బాల్యం నుంచే దేశభక్తి, తోటివారిపై ప్రేమానురాగాలు, మంచి నడవడిక నేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ క్యామ వెంకటరమణ హ్యాండ్ మైక్ అందజేశారు. విశ్వహిందూ పరిషత్ సభ్యులు, గ్రామ, మండల సమితిల సభ్యులు ఆంజనేయులు, శ్రీను, విక్రంపాల్గొన్నారు



మైసమ్మను దర్శించుకున్న వనపర్తి ఎమ్మెల్యే



పెద్దకొత్తపల్లి: మండలంలోని నాయినోనిపల్లి మైసమ్మ ఆలయాన్ని ఆదివారం వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి దర్శించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ బుడుగు శ్రీనివాస్‌యాదవ్, సిబ్బంది ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కోరిన కోర్కెలు తీర్చే మైసమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లప్పుడు ప్రజలకు ఉండాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట పెద్దకొత్తపల్లి ఎస్ఐ సతీష్, కో–ఆప్షన్ మాజీ సభ్యుడు ఎండీ సలీం, అధికారులు ఉన్నారు.

కారును ఢీకొన్న గుర్తు తెలియని వాహనం



కొత్తకోట రూరల్: మండలంలోని రాయిణిపేట స్టేజీ సమీపంలో జాతీయ రహదారి 44 పై కారును గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో పెను ప్రమాదం తప్పింది. రాయిణిపేటకు చెందిన ఇద్దరు వ్యక్తులు కారులో కొత్తకోటకు వెళ్తుండగా కర్నూల్ వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న గుర్తు తెలియని వాహనం కారును ఢీకొనడంతో కారు డివైడర్ పక్కకు ఆగిపోయింది. కారులో ఉన్న వారు తేరుకునే లోపు కారును ఢీకొన్న వాహనం వెళ్లిపోయింది. దీంతో కారులో ఉన్న వ్యక్తులు పెను ప్రమాదం నుంచి బయట పడటంతో ఊపిరి పీల్చుకున్నారు.

క్లుప్తంగా

వంశరాజుల అభ్యున్నతికి కృషి



మదనాపురం: మండలంలోని తిర్మలాయపల్లిలో ఆదివారం వంశరాజ్ సంక్షేమ సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుడిగా వెంకటస్వామి, గౌరవ సలహాదారులు పాశం సత్యనారాయణ, మండల అధ్యక్షుడిగా పాశం లక్ష్మన్న, ప్రధాన కార్యదర్శిగా కురుమూర్తి, ఉపాధ్యక్షులు వెంకటస్వామి, కార్యదర్శిగా కురుమూర్తి, సంయుక్త కార్యదర్శులుగా గంగాధర్, పాశం రాములు, రాజేష్, నరేష్, రాజశేఖర్, దామోదర్, వెంకటేష్, రవీంద్ర, శేషమ్మ, అలివేలు తదితరులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంశరాజుల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు.

దరకాస్తుల స్వీకరణ

ఖిల్లాఘనపురం: మండలంలోని దొంతికుంట తండా స్టేజీ వద్ద ఉన్న తెలంగాణ మోడల్ పాఠశాలలో 6వ తరగతి మొత్తం సీట్లతో పాటుగా 7 నుంచి 10వ తరగతి వరకు మిగిలి ఉన్న సీట్ల కోసం ప్రవేశపరీక్ష నిర్వహణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఉమాదేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 3న హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవడానికి ఆన్‌లైన్‌లో సిద్ధంగా ఉంటాయని తెలిపారు. ఏప్రిల్ 13న 6వ తరగతి వారికి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆదేవిధంగా 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మిగిలి ఉన్న సీట్ల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు నిర్వహించడం హాల్‌టికెట్లలో సూచించిన కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తున్నారన్నారు. అర్హత ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాకాస్తు చేసుకోవాలని సూచించారు.

బోరుమోటార్‌కు మరమ్మతు



కొత్తకోట రూరల్: మండలంలోని ఈదులబాయితండాలో తాగునీటి బోరు మరమ్మతుకు నోచుకోవడంతో తండావాసులు కొన్నిరోజులుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంకిరెడ్డిపల్లికి చెందిన ఎన్ఆర్ఐ అమర్‌రెడ్డికి ఫోన్ ద్వారా బోరు బాగు చేయించాలని చెప్పడంతో వెంటనే అమర్‌రెడ్డి ఈదులబాయితండాకు వెళ్లి సొంత డబ్బులతో బోరు మోటార్‌ను బాగు చేయించారు. తాగునీటి సమస్య ఉందని చెప్పిన వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి, ఎన్ఆర్ఐ అమర్‌రెడ్డి కి తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మన్యం, ముస్తఫా, బలేమియా, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

స్వర్ణ కవచ పంచలోహ శివలింగానికి పూజలు



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి గ్రామ శివారులో గల శ్రీదత్తకోటిలింగేశ్వర స్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన ధ్యాన మందిరంలో ప్రతిష్ఠించిన పాదరస సహిత నవరత్నాలంకృత స్వర్ణ కవచ పంచలోహ శివలింగానికి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రావుల రవీంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. అర్చకులు వేద మంత్రాలతో పూజలు జరిపి మహామంగళ హారతి ఇచ్చి మాజీ ఎమ్మెల్యేకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఎల్లమ్మ దేవర్లకు శాంతి పూజలు

అమరచింత: మండల కేంద్రంలోని బీరప్ప, ఎల్లమ్మ దేవర్లకు ఆదివారం శాంతి పూజలు నిర్వహించారు. పట్టణానికి చెందిన పత్తి కురువలు ప్రతి ఏడాది సంక్రాంతి పండుగకు ముందు దేవర్లకు శాంతి పూజలను నిర్వహిస్తుంటారు. ఆదివారం మేళతాళాలతో సమీపంలోని కృష్ణానదికి వెళ్లి పవిత్ర కృష్ణా జలాలను తీసుకొచ్చి దేవర్లకు అభిషేకించారు. బీరప్ప, ఎల్లమ్మ దేవర్ల పాదుకలను శుద్ధి చేసి పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. అదే విధంగా మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.